

సౌకర్యాల కల్పనకు కృషి

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు.

- 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్
మంగళ : 6:36

సహర్
బుధ : 4:42

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.4 /24.8

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రక్తదానం ప్రాణదానంతో సమానం



కామారెడ్డి క్రైం: రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ఎన్ శ్రీదేవి పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, రెడ్‌క్రాస్, జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆధ్వర్యంలో కామారెడ్డి బార్ అసోసియేషన్ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రక్తదానంతో ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దీక్ష, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు చింతల గోపి, కార్యదర్శి సురేందర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భుజంగరావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పర్యవేక్షకుడు చంద్రసేన్ రెడ్డి పాల్గొన్నారు.

సదరం శిబిరం తేదీల ఖరారు

కామారెడ్డి టౌన్: దివ్యాంగత్వం నిర్ధారణ కోసం ఏప్రిల్, మే, జూన్ నెలల్లో నిర్వహించే సదరం క్యాంపు తేదీలను ఖరారు చేసినట్లు డీఆర్‌డీవో చందర్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 24, 25 తేదీలతోపాటు మే 8, 9, జూన్ 22, 23 తేదీలలో శిబిరాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆయా తేదీలలో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించే సదరం శిబిరాలలో పాల్గొనేందుకు దివ్యాంగులు మీ సేవ కేంద్రాలలో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు.

'కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయాలి'

కామారెడ్డి క్రైం: ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి సి-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో సూచించారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను సి-విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే.. ఫిర్యాదు అందిన వంద నిముషాల్లోగా స్పందించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లు, ఫోన్ నంబర్‌స్ గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సి-విజిల్‌కు ఇప్పటివరకు 15 ఫిర్యాదులు వచ్చాయని, వాటిపై చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. 1950 టోల్ ఫ్రీ నంబరుకు ఓటరు కార్డు, ఓటు ఏ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉన్నది తదితర వివరాల కోసం 295 కాల్స్ వచ్చాయని, అన్నింటికీ సమాధానాలు ఇచ్చామని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమ నగదు, మద్యం సరఫరాను అడ్డుకోవడానికి, కానుకలను నియంత్రించడానికి సరిహద్దుల్లోని చెక్ పోస్టుల వద్ద గట్టి నిఘా ఉంచామని వివరించారు

షడ్రుచుల సమ్మేళనం ఉగాది



నేడు తెలుగు నూతన సంవత్సరాది ✦ వేడుకలకు ఆలయాలు సిద్ధం

తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని మంగళవారం జరుపుకోనున్నారు. శ్రీ శోభకృత్ నామ సంవత్సరానికి ముగింపు పలుకుతూ.. శ్రీ క్రోధి నామ సంవత్సరానికి ఆహ్వానం పలికేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా ఆలయాలను ముస్తాబు చేశారు. పండుగ పూట పూజల అనంతరం వేపపువ్వు, మామిడి కాయ, చింత పండు, ఉప్పు, బెల్లం, కారంతో తయారు చేసే పచ్చడి సేవించడం ఆనవాయితీగా వస్తోంది. పలు గ్రామాలలో ఆలయాల వద్ద ఎడ్ల బండ్ల ఊరేగింపు ఉంటుంది. కొన్నిచోట్ల జడకొప్పు ఆట, మరికొన్ని చోట్ల ఎడ్ల బండ్లు, ట్రాక్టర్ల ఊరేగింపులు నిర్వహిస్తారు. పండుగ పూట పచ్చడి సేవనం.. పంచాంగ శ్రవణం తప్పనిసరిగా చేస్తారు. పంచాంగ శ్రవణం, ఎడ్ల బండ్ల ఊరేగింపులు, ప్రత్యేక పూజలతో ఆలయాలు కిటకిటలాడనున్నాయి.

– సాక్షి, కామారెడ్డి



టార్గెట్ పాటిల్..!

జహీరాబాద్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్‌ను లక్ష్యంగా చేసుకుని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు విమర్శలకు పదును పెడుతున్నాయి. రెండుసార్లు ఎంపీగా గెలిచిన పాటిల్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని, ఆయన కనీసం నాయకులను కూడా గుర్తు పట్టరని ఆరోపణలు చేస్తున్నారు. అయితే పాటిల్ మాత్రం ఆ విమర్శలను పట్టించుకోకుండా, చేసిన అభివృద్ధిని వివరిస్తూ ప్రచారంలో సాగిపోతున్నారు.

- బీజేపీ అభ్యర్థిపై విరుచుకుపడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్
- ఎంపీగా పదేళ్లలో చేసిందేమీ లేదని విమర్శలు
- చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఓట్లడుగుతున్న బీబీ పాటిల్



సాక్షి, కామారెడ్డి : పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కాకముందే జహీరాబాద్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీలు అభ్యర్థులను ఖరారు చేశాయి. బీజేపీనుంచి సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ బరిలో దిగగా.. కాంగ్రెస్‌నుంచి మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్, బీఆర్ఎస్‌నుంచి వేణుగోపాల్ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 2014, 2019 ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా జహీరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసిన బీబీ పాటిల్.. రెండుసార్లూ విజయం సాధించారు. తొలిసారి బరిలో నిలిచినప్పుడు కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌పై 1,44,631 ఓట్ల తేడాతో గెలిచారు. 2019 ఎన్నికల్లో మాత్రం స్వల్ప ఓట్లతో గట్టెక్కారు. కాంగ్రెస్ అభ్యర్థి కన్నా 6,229 ఓట్లే ఎక్కువ వచ్చాయి. అయితే లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నా తన మెజారిటీ తగ్గిపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. ఎన్నికల తర్వాత జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలతో సంబంధాలు అంతంత మాత్రమయ్యాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడంతో పాటిల్ పార్టీ మారాలని నిర్ణయించుకుని బీజేపీ జాతీయ నాయకులను కలిసి, కాషాయ కండువా కప్పుకున్నారు. బీజేపీలో చేరిన నాటి నుంచే నియోజకవర్గం అంతటా విస్తృతంగా పర్యటిస్తున్న పాటిల్.. ఆయా ప్రాంతాల్లోని బీజేపీ నేతలను కలిసి మద్దతు కోరుతున్నారు. నాయకుల ఇళ్లకు వెళ్లి మరీ వారి సహకారాన్ని అభ్యర్థిస్తున్నారు. దీంతో కాషాయ పార్టీ నేతలంతా ఆయనకు మద్దతుగా నిలుస్తున్నారు.

పార్టీకి ద్రోహం చేశాడంటున్న బీఆర్ఎస్..

బీబీ పాటిల్‌ను రెండుసార్లు గెలిపిస్తే ఆయన పార్టీకి ద్రోహం చేశాడని బీఆర్ఎస్ విరుచుకుపడుతోంది. ఎంపీగా ప్రజలకు అందుబాటులో ఉండకుండా, నాయకులు, కార్యకర్తలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేయడమే గాక స్వార్థం కోసం పార్టీ మారాడంటూ విమర్శిస్తున్నారు. ఇటీవల జిల్లాలో పర్యటించిన మాజీ మంత్రి హరీష్‌రావుతో పాటు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్, ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే సురేందర్ ఎంపీ పాటిల్‌పై ఒంటి కాలిమీద లేస్తున్నారు. జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అయితే తన ఓటమికి పాటిలే కారణమంటూ కంటతడి కూడా పెట్టుకున్నారు.

ఇదిగో అభివృద్ధి అంటున్న పాటిల్..

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు విమర్శలతో దాడి చేస్తుండగా.. బీబీ పాటిల్ మాత్రం తన ప్రచారం తాను చేసుకుంటూ ముందుకెళ్తున్నారు. మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టాలని భావిస్తున్న బీబీ పాటిల్ నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఎంపీగా తాను చేసిన అభివృద్ధి ఇది అంటూ ఓ జాబితాను రూపొందించి కరపత్రాల రూపంలో జనం ముందుంచుతున్నారు. కామారెడ్డి రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు నిధుల మంజూరుతో పాటు జాతీయ రహదారుల అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాలకు కేంద్ర నిధులతో రహదారులు, ఇంకా జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులను వివరిస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ విమర్శలపై ప్రత్యక్షంగా ఎక్కడా స్పందించకుండానే.. చేసిన అభివృద్ధిని వివరిస్తూ, మరోసారి ఎంపీగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇస్తూ ప్రచార పర్వంలో సాగిపోతున్నారు.

ఫెయిల్యూర్ ఎంపీ అంటూ..

రెండు పర్యాయాలు ఎంపీగా పనిచేసిన బీబీ పాటిల్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జి, మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంత్ రావ్, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి తదితరులు సమావేశాల్లో ఎంపీ పాటిల్‌ను టార్గెట్ చేస్తూ మాట్లాడుతున్నారు. 'బీబీ పాటిల్ కాదు.. బిజినెస్ పాటిల్' అని విమర్శిస్తున్నారు.

చైర్‌పర్సన్‌గా బీజేపీ అభ్యర్థిని ఎన్నుకోండి

- సుపరిపాలనకోసం పార్టీలకతీతంగా మద్దతివ్వండి
- కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్ పిలుపు
- ప్రజలు సైతం కౌన్సిలర్లపై ఒత్తిడి తేవాలని వినతి



మాట్లాడుతున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: కామారెడ్డి బల్దియాలో అవినీతి రహిత పాలన కోసం బీజేపీ అభ్యర్థిని చైర్‌పర్సన్‌గా ఎన్నుకోవాలని ఎమ్మెల్యే కేవీఆర్ కౌన్సిలర్లను కోరారు. ఇందుకోసం ప్రజలు తమ కౌన్సిలర్‌లపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. సోమవారం ఆయన పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు కలిసి కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిని గద్దె దింపారన్నారు. జాహ్నవి గద్దె దిగిపోతే బల్దియాలో అవినీతి పోతుందా అని ప్రశ్నించారు. నూతన చైర్‌పర్సన్‌ను ఎన్నుకునే ప్రక్రియలో పెనం నుంచి పొయ్యిలో పడొద్దన్నారు. పార్టీలకు అతీతంగా మంచి వ్యక్తిని ఎన్నుకోవాలని సూచించారు.

ఆ నలుగురే కారణం..

చైర్‌పర్సన్ పది శాతం అవినీతికి పాల్పడితే 90 శాతం అవినీతికి ఆ నలుగురు వ్యక్తులే కారణమని ఎమ్మెల్యే కేవీఆర్ ఆరోపించారు. ప్రజా దర్బార్‌లో నిట్టు జాహ్నవిపై ఒక్క ఫిర్యాదు రాలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, అతని సోదరుడు ఆ నలుగురితోనే పట్టణంలో అవినీతి పెరిగిందని ఆరోపించారు. మాస్టర్ ప్లాన్‌లో 100 ఫీట్ల రోడ్లు, సర్వే నంబర్ ఆరులోని భూమి, జయశంకర్ కాలనీలో 20 ఎకరాల అసైన్‌మెంట్ భూమి కబ్జా.. ఇలా అన్నింటిలో ఆ నలుగురే ఉన్నారని, ఎన్నికల కోడ్ అనంతరం సాక్ష్యాలతో నిరూపిస్తానని పేర్కొన్నారు. తాగునీటి కోసం వినియోగించుకోవాల్సిన ఎస్‌డీఎఫ్ నిధులను సీసీ రోడ్లకు మళ్లించారని పేర్కొన్నారు. బల్దియా ఆదాయం తగ్గడానికి ఆ నలుగురే కారణమని పేర్కొన్నారు. ఆస్తి పన్నులు ఎగ్గొడుతున్న బహుళ అంతస్తుల భవనాల యజమానుల వెనక కూడా వారే ఉన్నారన్నారు. ఇలా అయితే పట్టణం ఎలా అభివృద్ధి చెందుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కామారెడ్డి పట్టణంలో రాజకీయ మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. 49 మంది కౌన్సిలర్లు కూర్చుని మాట్లాడుకుని పార్టీలతో సంబంధం లేకుండా నిజాయితీ గల వ్యక్తిని చైర్‌పర్సన్‌గా ఎన్నుకుంటే తాను సహకరిస్తానన్నారు. లేకపోతే బీజేపీకి అవకాశం ఇస్తే పట్టణంలో అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు.

రసవత్తరంగా పుర రాజకీయం

- చైర్‌పర్సన్ పదవినుంచి జాహ్నవిని తొలగిస్తూ గెజిట్ జారీ
- 15న నూతన చైర్‌పర్సన్ ఎన్నికకు నోటిఫికేషన్
- అధ్యక్ష పీఠం కోసం కాంగ్రెస్‌లో ఇద్దరి మధ్య పోటీ
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లలో వర్గపోరు
- బల్దియాపై కన్నేసిన బీజేపీ



కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ నిట్టు జాహ్నవిపై గతనెల 30న అవిశ్వాసం బలపరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. అవిశ్వాసం నెగ్గడంతో ఆమెను పదవి నుంచి తొలగిస్తూ ఈనెల 4న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ గెజిట్ విడుదల చేశారు. ఈనెల 15న నూతన చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ సైతం జారీ చేసింది. దీంతో మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి బల్దియాలో రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఈనెల 15న కొత్త చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించనున్నారు. కాగా కాంగ్రెస్‌లో చైర్‌పర్సన్ స్థానాన్ని ఇద్దరు కౌన్సిలర్లు ఆశిస్తున్నారు. మరోవైపు బీజేపీ సైతం బల్దియాపై కన్నేయడంతో రాజకీయ వేడి మరింత పెరిగింది.

బీఆర్ఎస్‌లో గ్రూపులు..

బల్దియాలో బీఆర్ఎస్‌కు 16 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇందులో 10 మంది కౌన్సిలర్‌లు చైర్‌పర్సన్ జాహ్నవిని గద్దె దింపడంలో కాంగ్రెస్‌కు సహకరించారు. బీఆర్ఎస్‌లోనే ఉంటూ అవిశ్వాసానికి మద్దతు ఇవ్వడంపై మిగిలిన కౌన్సిలర్‌లు గుర్రుగా ఉన్నారు. రెండు వర్గాలుగా విడిపోయిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు.. చైర్‌పర్సన్ ఎన్నిక సమయంలో ఎలా వ్యవహరిస్తారన్న అంశం చర్చనీయాంశంగా మారింది.

రేసులోకి బీజేపీ!

బీజేపీకి ఏడుగురు కౌన్సిలర్లు ఉన్నారు. ఎమ్మెల్యే ఓటుతో కలిపి ఆ పార్టీ బలం ఎనిమిదికి చేరుతుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లలోని వర్గపోరును బీజేపీ అనుకూలంగా మలచుకుంటోంది. అభివృద్ధి, అవినీతి రహిత పాలన కోసం తమకు అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ నేతలు కౌన్సిలర్లను కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీ అభ్యర్థి చైర్‌పర్సన్ స్థానం కోసం పోటీలో ఉండే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. అలా జరిగితే బీఆర్ఎస్ కౌన్సిలర్లలో చాలామంది బీజేపీకి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌కు చెందిన పలువురు కౌన్సిలర్లు సైతం బీజేపీవైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. బీఆర్ఎస్‌కు చెందిన 12 మంది, కాంగ్రెస్ సభ్యులు 8 మంది వరకు బీజేపీకి మద్దతు ఇచ్చే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే నిజమైతే కామారెడ్డి బల్దియా కాషాయ పార్టీ కైవసం అవడం ఖాయమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఎవరికో అవకాశం?

బల్దియాలో 49 మంది కౌన్సిలర్‌లతో పాటు ఎక్స్ అఫీషియో సభ్యుడు ఎమ్మెల్యేతో కలిసి 50 ఓట్లు ఉన్నాయి. 26 మంది సభ్యులు ఎవరికి ఓటు వేస్తే వారే నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికవుతారు. బీఆర్ఎస్, బీజేపీలనుంచి వచ్చి చేరిన వారితో కలిపి కాంగ్రెస్‌కు 27 మంది సభ్యుల బలం ఉంది. అవిశ్వాస పరీక్షకు పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కూడా మద్దతు ఇచ్చారు. దీంతో కాంగ్రెస్ చైర్‌పర్సన్ స్థానాన్ని కైవసం చేసుకునే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. అయితే కాంగ్రెస్‌లో చైర్‌పర్సన్ స్థానాన్ని ఇద్దరు ఆశిస్తున్నారు. బీఆర్ఎస్ కౌన్సిలర్‌లను కాంగ్రెస్‌లో చేర్పించడంలో 10వ వార్డు కౌన్సిలర్ ఉర్దొండ వనిత, ఆమె భర్త రవి కీలకంగా వ్యవహరించారు. కాంగ్రెస్లో 16 మంది కౌన్సిలర్లను చేర్పించిన తననే చైర్‌పర్సన్ చేయాలని వనిత కోరుతున్నారు. మరోవైపు వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ సైతం ఈ పదవిని ఆశిస్తున్నారు. ఆమె భర్త చంద్రశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి సోదరుడు కొండల్‌రెడ్డికి సన్నిహితుడు. ఆయన ద్వారా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. కాగా కాంగ్రెస్ టికెట్టుపై గెలిచిన కౌన్సిలర్‌లు, సీనియర్‌లు, బీఆర్ఎస్ నుంచి వచ్చిన కౌన్సిలర్‌ల మధ్య విభేదాలు ఏర్పడి, వర్గాలుగా విడిపోయినట్లు తెలుస్తోంది. దీంతో ఎవరు చైర్‌పర్సన్ అవుతారన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది.

క్లుప్తంగా

విద్యార్థులకు ఉచిత సర్వీస్



పెద్దకొడప్‌గల్(జుక్కల్) : సుమారు 3 కి.మీ దూరం విద్యార్థులు నిత్యం పాఠశాలకు నడుచుకుంటూ వెళ్తుండడం చూసిన ఆ యువకుడు వారి కష్టాన్ని దూరం చేసేందుకు ముందుకొచ్చాడు. నిత్యం సుమారు 50మంది విద్యార్థులను తన ఆటోలో ఉచితంగా తీసుకెళ్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. మండలంలోని కాటేపల్లి తండాలో 50 మంది విద్యార్థులు కాటేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్తుంటారు. వారికి దూరభారం కావడంతో తండాకు చెందిన యువకుడు బామన్ జేతిలాల్ తనకున్న ఆటోలో నిత్యం వారిని కాటేపల్లి వరకు ఉదయం, మధ్యాహ్నం ఉచితంగా తీసుకెళ్తూ తీసుకొస్తున్నాడు. తండావాసులు ఈ సందర్భంగా బామన్ జేతిలాల్‌ను అభినందిస్తున్నారు.

ఉగాది పండుగ శుభాకాంక్షలు

బాన్సువాడ : బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి నియోజకవర్గ ప్రజలందరికీ క్రోధి నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. నూతన తెలుగు సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

కోడ్ ఉల్లంఘించారని ఎంపీపీపై ఫిర్యాదు

భిక్కనూరు : భిక్కనూరు మండల పరిషత్ అధ్యక్షుడు జాంగారి గాలిరెడ్డి ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని బీఆర్ఎస్ నేతలు జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు జిల్లా ఎస్పీ సింధూశర్మకు సోమవారం రాత్రి పిర్యాదు చేశారు. ఎంపీపీ గాలిరెడ్డి తనతో పాటు మరో ఎనిమిది మంది కాంగ్రెస్ నేతలతో కలిసి సోమవారం భిక్కనూరు మండల పరిషత్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించాడని ఇది ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినట్లేనని బీఆర్ఎస్ నేతలు కలెక్టర్, ఎస్పీలకు పిర్యాదు చేశారు. దీంతో జిల్లా కలెక్టర్ ఈ విషయమై మండల పరిషత్ అధికారులను వివరణ కోరారని, ఇది నిజమైతే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కలెక్టర్ మండల పరిషత్ అధికారులకు ఆదేశాలు జారీచేసినట్లు విశ్వసనీయ సమాచారం.

విధుల్లో నిర్లక్ష్యంతో రోగులకు ఇబ్బందులు



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల్లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు రోగులను పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది. కాని మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేళకు రాకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు రోగులు పేర్కొంటున్నారు. సోమవారం రోగులు వచ్చినప్పటికీ ఎంఎల్‌హెచ్‌పీ పత్తా లేరు. దీంతో రోగులు కేవలం ముందులు తీసుకుని వెళ్లిపోయారు. ఈ విషయమై ఉప కేంద్ర సిబ్బందిని వివరణ కోరగా తమకు సమాచారం లేదని ఉన్నతాధికారులకు తెలిసి ఉండవచ్చని పేర్కొన్నారు.

పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు కృషి

- కలెక్టర్ జితేష్ వి పాటిల్
- పనులు త్వరగా పూర్తవ్వాలని ఆదేశం



చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి రూరల్ : అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న విద్యార్థులకు సరిపడా మూత్రశాలలు అందులో నీటిసౌకర్యం మౌలిక వసతులు ఉన్నాయా అని సంబంధిత హెడ్మాస్టర్లను అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్లో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీరు, ఎలక్ట్రీషియన్ తదితర పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీఈవో రాజు, ఎంఈవో ఎల్లయ్య, ఎంపీడీవో నాగవర్ధన్, ఎంపీవో మలహరి, గ్రామ కార్యదర్శి మౌనిక, హెచ్‌ఎం సాయిరెడ్డి, నళిని, హన్మాండ్లు, సిద్దయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో..

బాన్సువాడ రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించి బలోపేతం చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం ఆయన బాన్సువాడ మండలం కొయ్యగుట్ట జీపీ పరిధిలోని కేవ్లానాయక్ తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ కమిటీ మౌలిక సూత్రాలను అధికారులకు వివరించారు. ప్రస్తుతం పాఠశాలలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, కావాల్సిన మౌలిక వసతుల గురించి తెల్సుకున్నారు. మరుగుదొడ్లను పరిశీలించారు. మండలంలోని అన్ని పాఠశాలలను తనిఖీ చేసి ఎలాంటి వసతులు కల్పించాలో ప్రత్యేక నివేదిక ఇవ్వాలని ఎంపీడీవో బషీరుద్దీన్‌ను ఆదేశించారు. పంచాయతీరాజ్ ఏఈ గోపితో కలిసి ప్రతిపాదనలు సిద్ధంచేసి అందజేయాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎంఈవో సత్యనారాయణరెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

సదాశివనగర్‌లో..

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో భాగంగా మండలంలో ఎంపిక చేసిన కొన్ని ప్రభుత్వ పాఠశాలలను సోమవారం కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధానంగా నాలుగు కంపోనెంట్లు అయిన డ్రింకింగ్ వాటర్, ఎలక్ట్రీషియన్, టాయిలెట్స్, మైనర్ రిఫర్‌పై పంచాయతీ ఇంజినీర్లకు తగు సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో యోసెఫ్, పీఆర్ ఈఈ సదాశివరెడ్డి, ఈడీ వీరానంద్ రావు, బాలలింగం, ఏఈ మారుతి, ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీవో సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

అడవిలో ఎలుగుబంటి కళేబరం

- వేటాడారా? హైనాలు దాడి చేశాయా?
- మద్దికుంట – రెడ్డిపేట గ్రామాల మధ్య ఘటన
- రోజులు గడుస్తున్నా గుర్తించని అటవీశాఖ అధికారులు



మద్దికుంట - రెడ్డిపేట అటవీ ప్రాంతంలో కనిపించిన ఎలుగుబంటి తల

రామారెడ్డి: మండలంలోని మద్దికుంట – రెడ్డిపేట గ్రామాల మధ్య అటవీప్రాంతంలో ఎలుగుబంటి పిల్ల మృతి చెందిన ఘటన సోమవారం వెలుగుచూసింది. అయితే, ఎలుగుబంటి పిల్ల రెండు నెలల క్రితం మృతి చెందిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఘటనా స్థలంలో ఎలుబంటి తల పడి ఉండగా, మరోచోట దాని వెంట్రుకలు, పక్కనే పెద్దకర్ర పడి ఉండడంతో వేటగాళ్ల ఉచ్చుకు బలయ్యిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై మాచారెడ్డి రేంజ్ అధికారిణి దివ్య స్పందించారు. ఎలుగుబంటి పిల్ల నీళ్ల లేక మృతి చెందలేదన్నారు. కళేబరాన్ని కళేబరాన్ని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించామని, నక్కలు లేదా హైనాల దాడిలో మృతి చెందినట్లు అనుమానం వ్యక్తం చేశారు. అయితే, వివిధ రకాల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి పనికొస్తాయని ఎలుగుబంటి అవయవాలతోపాటు గోళ్లను అమ్ముకుని వేటగాళ్లు సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

జంతువుల వేట ఆగడం లేదా?

మండలంలో ప్రధానంగా అన్నారం, రెడ్డిపేట, సింగరాయపల్లి అటవీ ప్రాంతాల్లో జంతువుల వేట కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే అన్నారం గ్రామంలో జంతువుల వేట కోసం దాచిన నాటు బాంబు పేలిన ఘటన మరవకముందే అటవీ ప్రాంతంలో ఎలుగుబంటి పిల్ల కలేబరం కనిపించింది. గతేడాది సింగరాయపల్లి అడవుల్లో జంతువులను వేటాడేందుకు వెళ్లి రెడ్డిపేట గ్రామానికి చెందిన శాడ రాజు బండరాళ్ల మధ్య ఇరుక్కున్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. జిల్లా అధికారయంత్రాంగం రెండురోజులపాటు శ్రమించి రాజును బయటికి తీశారు.

కొన్ని నెలల క్రితం వేటగాడు శాడ రాజు ఇంట్లో వలను స్వాధీనం చేసుకున్నట్లుగా అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. సింగరాయపల్లి, రెడ్డిపేట ప్రాంతాల్లో అడవులు విస్తరించి ఉండటం, అటవీశాఖ అధికారుల నిఘా కొరవడడంతో జంతువుల వేట ఇష్టానుసారంగా కొనసాగుతోందని మండలవాసులు అంటున్నారు. ఇటీవలే నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో రెండు సెక్షన్లకు సంబంధించిన ప్రగతి నివేదికలను సమర్పించకపోవడంపై ఎంపీపీ దశరథ్‌రెడ్డి, సభ్యులు అటవీశాఖ సెక్షన్ అధికారులు శంకర్, జయశ్రీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గడిచిన నాలుగేళ్లలో రెండు సెక్షన్ల పరిధిలోని ప్రగతి నివేదికలను సభలో సమర్పించలేదన్నారు.

చింతల్‌గుట్ట శివారులో సంచారం..

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని చింతల్ గుట్టతండా శివారులో ఎలుగుబంటి సంచరిస్తున్నట్లు తండావాసులు తెలిపారు. సోమవారం సాయంత్రం గ్రామం పక్కనే ఉన్న చెరువులో నీళ్లతాగి తిరిగి వెళ్తున్న దృశ్యాలను తండావాసులు సెల్‌ఫోన్లలో చిత్రీకరించారు. తండాకు చెరువు ఆనుకొని ఉండడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. అడవిలో నీళ్ల లేక గత వారం రోజులుగా ప్రతి రోజూ చెరువుకు వస్తున్నదన్నారు. అటవీశాఖ అధికారులు సాసర్ ఫీట్లలో నీరు నింపాలని కోరుతున్నారు. గొర్రెలు, మేకల కాపరులు, తునికాకును సేకరించేందుకు మహిళలు ప్రతిరోజూ అటవీ ప్రాంతానికి వెళ్తారని, తండాకు చెందిన పిల్లలు చెరువువైపు తిరుగుతుంటారని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు



జుక్కల్‌లో స్థానికులతో కలిసి టిఫిన్ చేస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

నిజాంసాగర్(జుక్కల్): కాలనీల్లో మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరిస్తారన్నారు. సోమవారం జుక్కల్ మండల కేంద్రం లోని బస్టాండ్ ప్రాంతంలో హోటల్‌కు సామాన్యుడిలా వెళ్లి టిఫిన్ చేసి, టీ తాగారు. అక్కడి చిరువ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్యాంప్ కార్యాలయం వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నీటి ఎద్దడి ఉన్న కాలనీలు, గ్రామాల్లో బోర్లు వేయించి నీటి వసతిని కల్పించడం జరిగిందన్నారు. శాఖల వారిగా వస్తున్న సమస్యలను వారం రోజుల్లో అధికారులు పరిష్కారిస్తారని చెప్పారు. ఆయన వెంట స్థానిక నాయకులు అస్పత్ వార్ వినోద్, అనిల్ తదితరులు ఉన్నారు.

మద్నూర్(జుక్కల్) : కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతరావు పేర్కొన్నారు. మండలంలోని తడి హిప్పర్గా గ్రామంలోని వంద మంది బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సోమవారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సాయిలు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ సంగమేశ్వర్, నాయకులు హన్మంత్, రమేశ్, బాలుషిండే తదితరులున్నారు.

నిజాంసాగర్(జుక్కల్) : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతితో పాటు మైనార్టీల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి పెద్ద పీట వేశారని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. సోమవారం జుక్కల్ నియోజకవర్గ మైనార్టీలకు పత్లాపూర్ వద్ద ఇఫ్తార్ విందును ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జయప్రదీప్, మల్లికార్జున్, రవీందర్ రెడ్డి, రాంరెడ్డి, వినోద్ తదితరులు ఉన్నారు.

నిజాయితీ చాటుకున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్



బంగారాన్ని సీఐకి అప్పగిస్తున్న బీట్ ఆఫీసర్ స్వాతి

బాన్సువాడ : రోడ్డుపై దొరికిన బంగారాన్ని సీఐ కృష్ణకు అప్పగించి నిజాయితీ చాటుకున్నారు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ స్వాతి. బాన్సువాడ పట్టణానికి చెందిన గాదం స్వాతి నిజాంసాగర్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వ్యక్తిగత పనిపై సోమవారం బాన్సువాడకు వెళ్లి తిరిగి వస్తుండగా, రోడ్డుపై రెండు గ్రాముల పుస్తెపడి ఉండడంతో చుట్టు పక్కల వారిని వాకబు చేశారు. దొరికిన బంగారాన్ని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐకు అప్పగించగా, సీఐ బీట్ ఆఫీసర్‌ను అభినందించారు. స్వాతి వెంట ఆమె తండ్రి సత్యనారాయణ ఉన్నారు.

హన్మాజీపేట్‌లో వడగండ్ల వాన



హన్మాజీపేట్‌లో కురిసిన వడగండ్ల వాన

బాన్సువాడ రూరల్: మండలంలోని హన్మాజీపేట్, కాద్లాపూర్ గ్రామాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో సోమవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. వర్షంతో పాటు భారీగా వడగండ్లు కురవడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మొక్కజొన్న, వరి పంటలు చేతికొస్తున్న తరుణంలో కురిసిన వడగండ్లతో కూడిన వర్షం తీవ్ర నష్టాన్ని మిగిల్చిందని రైతులు ఆవేదన చెందారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు



అవగాహన కల్పిస్తున్న షీ టీం ఎస్సై స్రవంతి

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల విద్యార్థులకు కామారెడ్డి షీ టీం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షీ టీమ్ ఎస్సై స్రవంతి చట్టాలపై అవగాహన కల్పిస్తూ ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, మహిళల అక్రమ రవాణా, బాలల దుర్వినియోగం, బాల్య వివాహాలు, బాల కార్మికులు, పని వేధింపులు, గుడ్ టచ్ మరియు బ్యాడ్ టచ్, సైబర్ క్రైమ్, సైబర్ బెదిరింపు అంశాలపై అవగాహన కల్పించారు. సైబర్ హెల్ప్ లైన్ నంబర్ 1930 ద్వారా షీటీమ్ ఎల్లప్పుడూ ఇబ్బందుల్లో ఉన్న విద్యార్థినులకు, మహిళలకు సహాయం చేస్తుందన్నారు. ఎక్కడైనా ప్రమాదంలో పడితే, అత్యవసరంగా ఉంటే 100 ఎమర్జెన్సీకి సంప్రదించాలని, అలాగే కామారెడ్డి షీ టీమ్ నంబర్ 8712686094ను సంప్రదించవచ్చన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్ : ములుగు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై ఫోన్‌లో దూషించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ అధ్యక్షుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఫోన్‌లో బెదిరించడం అమానుషమైన చర్య అని,రాష్ట్ర వ్యాప్తంగా ప్రభు త్వం వైద్యుల సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఆ నాయకుడు తక్షణమే బేషరతుగా రాతపూర్వకంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వికాసానికి, వినాశనానికి మధ్య ఎన్నికలు

- ప్రజల సంక్షేమమే బీజేపీ ఎజెండా
- 12 స్థానాల్లో విజయం సాధిస్తాం
- కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారింది
- తెలంగాణ పార్లమెంట్ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి అభయ్ పాటిల్

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలు బీజేపీ వికాసానికి, కాంగ్రెస్ వినాశనానికి మధ్య జరుగుతున్నాయని, ప్రజలు వినాశనాన్ని కోరుకుంటారా? వికాసాన్ని దగ్గరవుతారా? అని తెలంగాణ పార్లమెంట్ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి, కర్ణాటక ఎమ్మెల్యే అభయ్ పాటిల్ పేర్కొన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ రాజకీయాల్లో బీజేపీ క్రియాశీల పాత్రపోషిస్తోందని, మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. దేశాన్ని అనేక రంగాల్లో అభివృద్ధి పథంలో ప్రధాని మోదీ నడిపించారని, మరోసారి అవకాశమిస్తే మరింత అభివృద్ధితో పాటు పెండింగ్ పనులను కూడా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల ప్రజలు మళ్లీ బీజేపీని గద్దెనెక్కిస్తారని ధీమా వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ నాయకులు స్వచ్ఛందంగా బీజేపీలో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలకు ప్రధాని మోదీని ఓడించే ఎజెండా మాత్రమే ఉందని, కానీ దేశ ప్రజల సంక్షేమమే బీజేపీ ఎజెండా అని స్పష్టంచేశారు. తెలంగాణలో జరిగే పార్లమెంట్ ఎన్నికలు దేశ రాజకీయాల్లో పెను మార్పులు తేనున్నాయన్నారు. రేవంత్‌రెడ్డి ట్యాక్స్ పేరుతో వసూళ్లకు పాల్పడుతున్నారని, కాంగ్రెస్‌కు తెలంగాణ ఏటీఎంగా మారిందని ఆరోపించారు. తెలంగాణలో బీజేపీకి 12 సీట్లు పక్కాగా వస్తాయని, దేశంలో 370 సీట్లలో బీజేపీ గెలవబోతోందని ధీమా వ్యక్తంచేశారు.

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ దేశమంతా మోదీమయమైందని, ప్రజలందరూ ఆయన నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, నిజామాబాద్ పార్లమెంట్ ప్రభారీ వెంకటరమణి, జిల్లా అధ్యక్షుడు దినేశ్‌కులాచారి, నాయకులు గద్దె భూమన్న, పద్మారెడ్డి, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, స్వామి యాదవ్, నారాయణ యాదవ్, బద్దం కిషన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అభయ్ పాటిల్

క్రైం కార్నర్

గుండెపోటుతో ప్రైవేట్ టీచర్ మృతి



సంధ్య (ఫైల్)

జక్రాన్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయురాలు గొట్టుముక్కల సంధ్య (26)సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. రెండు రోజుల క్రితం బీపీ ఎక్కువ కావడంతో సంధ్య స్కూల్‌కు వెళ్లకుండా ఇంట్లోలో ఉందని స్థానికులు తెలిపారు. ఆదివారం మళ్లీ బీపీ ఎక్కువకావడంతో ఆర్మూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, సోమవారం గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

ఆర్మూర్‌టౌన్: పట్టణ శివారులోని జాతీయ రహదారి నంబర్ 63పై గుర్తు తెలియని వాహనం ఢీకొని రమేశ్(55) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. అంకాపూర్ సమీపంలోని ఓ క్రషర్‌లో పనిచేసే రమేశ్ రోజులాగే ఆదివారం రాత్రి 8గంటలకు సైకిల్‌పై బయల్దేరాడు. ఈ క్రమంలో పట్టణ శివారులో గుర్తు తెలియని వాహనం సైకిల్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో రమేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించి చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే రమేశ్ మృతి చెందినట్లు వైద్యులు అంబులెన్స్ సిబ్బందికి తెలిపారు. సోమవారం ఉదయం సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరిస్థితి విషమించి..

రుద్రూర్: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన రఘు (39) అనే వ్యక్తి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై అప్పారావు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బోధన్ మండలం ఆచన్‌పల్లికి చెందిన తాటి రఘు ఈ నెల 6న రుద్రూర్‌లోని అత్తవారింటికి వచ్చాడు. సాయంత్రం వేళ నడుచుకుంటూ వస్తుండగా ట్రాలీ ఆటో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని బోధన్ ఆస్పత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించగా పరిస్థితి విషమించి ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య సావిత్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నీటిలో మునిగి జాలరి..

రెంజల్(బోధన్): కుల సభ్యులతో కలిసి చెరువులో చేపల వేటకు వెళ్లిన జాలరి ప్రమాదవశాత్తు కాళ్లు, చేతులకు వల చుట్టుకోవడంతో మృతిచెందాడు. ఎస్సై సాయన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని దూపల్లికి చెందిన బొత్త లస్మయ్య(65) కులసభ్యులతో కలిసి ఆదివారం గ్రామపెద్ద చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలను వేటాడుతుండగా ప్రమాదవశాత్తు వల అతడి చేతులు, కాళ్లకు చుట్టుకోవడంతో నీటిమునిగిపోయాడు. కులసభ్యులు నీటిలో ఎంత గాలించినా ఆచూకీ లభించలేదు. మంగళవారం నీటిపై మృతదేహం తేలడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి కొడుకు భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెట్టును ఢీకొన్న స్కూల్ బస్సు



భీమ్‌గల్ : మండలంలోని కారెపల్లి వద్ద స్కూల్ బస్సు చెట్టను ఢీకొట్టింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు సోమవారం ఉదయం కారెపల్లిలో విద్యార్థులను ఎక్కించుకొని భీమ్‌గల్ వైపు వెళ్తుండగా స్టీరింగ్‌లో సమస్య తలెత్తి అదుపు తప్పి కారెపల్లి గండి ఘాట్ రోడ్డు వద్ద చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఘటనపై స్థానిక నాయకులతో మాట్లాడారు. ఆందోళన చెందొద్దని విద్యార్థుల తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు.

ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆయిల్ చోరీ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండలంలోని గోపాల్‌పేట్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఆయిల్‌ను దుండగులు చోరీ చేసినట్లు స్థానికులు తెలిపారు. జనార్దన్‌రెడ్డి, సంజీవరెడ్డి అనే రైతులకు సంబంధించిన పంటపొలాల్లో ఉన్న రెండు 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి దొంగలు ఆయిల్‌ను చోరీ చేశారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు విద్యుత్ శాఖ అధికారులు మనోరంజన్, శశికాంత్‌రెడ్డి తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

ఆర్మూర్‌టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని మామిడిపల్లి శివారులో పేకాట స్థావరంపై ఆదివారం రాత్రి పోలీసులు దాడి చేశారు. ఐదుగురి అదుపులోకి తీసుకొని రూ.10వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చదువు ఇష్టం లేక ఆత్మహత్య



సూర్య(ఫైల్)

నవీపేట: చదువు ఇష్టం లేక మండలంలోని నాగేపూర్ గ్రామానికి చెందిన సూర్య(17) సోమవారం గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై గఫార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఇటీవల ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన సూర్య జిల్లా కేంద్రంలో ఎంసెట్ కోచింగ్ తీసుకుంటున్నాడు. ఆదివారం రోజు తన తండ్రి శ్రీనివాస్ పుట్టినరోజు కావడంతో స్వగ్రామానికి వచ్చి వేడుకలో పాల్గొన్నాడు. ఆ తరువాత సూర్య విద్యాభ్యాసంపై చర్చ జరుగగా.. తనకు చదువంటే ఇష్టం లేదని, కోచింగ్‌లో ఏమీ అర్థం కావడం లేదని ఇంట్లో తెలిపాడు. అమ్మానాన్నల ఆశలకు అనుగుణంగా చదువలేకపోతున్నానని తీవ్ర మనస్తాపం చెంది యంచ శివారులోని గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

భార్యతో గొడవపడి..

వర్ని (మోస్రా) : మోస్రా గ్రామానికి చెందిన దూపల్లి సాయిలు భూమి విషయంలో తన భార్యతో గొడవపడి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటన చోటు చేసుకుంది. మద్యం మత్తులో ఉన్న సాయిలు క్షణికావేశంలో ఉరేసుకున్నాడని, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వర్ని ఎస్సై కృష్ణకుమార్ తెలిపారు.

యూపీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: హైదరాబాద్‌లోని మైనారిటీ స్టడీ సర్కిల్ శిక్షణ కేంద్రంలో యూపీఎస్సీ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి టి.దయానంద్ తెలిపారు. వంద మందికి శిక్షణ ఇస్తారని, అర్హులైన అభ్యర్థులు ఈనెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 28న కామారెడ్డి జిల్లాకు సంబంధించి జిల్లాకేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో స్క్రీనింగ్ పరీక్ష ఉంటుందని తెలిపారు.